## నాకు రుణం వస్తదో.. రాదో..



ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసిన. ఆర్థిక ఇబ్బందుల వల్ల వ్యాపారం పెట్టుకోలేక ఖాళీగా ఉంటున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాలు ఇస్తామని ప్రచారం చేస్తున్నది. నేను కూడా దరఖాస్తు చేసిన. మాలాంటోళ్లకు రుణం వస్తదో.. రాదో చూడాలి. సర్కారు చెప్పేదొకటి, చేసేదొకటి మాదిరిగా ఉంది.

–గుగులోతు నాగ, ఖమ్మం

## ఇదంతా ఊరించే ప్రయత్నమే..



ప్రభుత్వానికి ఊరించి మోసగించడమే తెలుసు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతీ యువకులను మోసం చేయడానికే ఈ పథకం అనుకుంటున్నం. దరఖాస్తు కోసం నాలుగు రోజులు మీసేవా, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. మరి రుణం ఏమాత్రం ఇస్తరో వేచి చూడాలి.

–భుక్యా సరిత, బుర్హాన్‌పురం


# నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | KHAMMAM




సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు, చిత్రంలో వనమా, సీతాలక్ష్మి

# వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- వరంగల్ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- కేసీఆర్ పేరును చెరిపేయడం ఎవరి తరమూ కాదు
- కొత్తగూడెం సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా
- తెలంగాణ పాలిట భూతంగా రేవంత్ సర్కారు: వనమా



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఉద్యమ పార్టీకి ప్రజలు మళ్లీ పట్టం కడతారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు స్పష్టం చేశారు. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) స్థాపితమై 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో ఏర్పాటుచేస్తున్న భారీ బహిరంగ సభకు, పార్టీ రజతోత్సవానికి ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన వరంగల్ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదో ఆశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకొని తప్పుచేశామని ప్రజలు మదనపడుతున్నారని అన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పాలనలో ఎక్కడా అభివృద్ధి కన్పించడం లేదని ప్రజలే చెబుతున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క గ్యారెంటీ హామీని కూడా వంద శాతం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఆస్తులు అమ్మడం, అప్పులు తేవడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని విమర్శించారు. ఇప్పటికీ రుణమాఫీని సంపూర్ణంగా చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నాడు కేసీఆర్ కట్టిన సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పాలకులు అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టును వారే కట్టినట్లుగా గప్పాలు కొట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

**తెలంగాణ పాలిట భూతం రేవంత్: వనమా**



తెలంగాణ పాలిట భూతంగా రేవంత్ సర్కారు తయారైందని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విమర్శించారు. కాంగ్రెస్ మెడలు వంచేందుకే వరంగల్‌లో భారీ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నో అవమానాలు, అవహేళనలను దాటుకొని ఉద్యమం ద్వారా తెలంగాణను సాధించుకున్న బీఆర్ఎస్ మాత్రమే రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కాపు సీతాలక్ష్మి, కాపు కృష్ణ, దామోదర్, సోనా, శాంతి, కొట్టి వెంకటేశ్వర్లు, ముంతపురి రాజుగౌడ్, సంకుబాపన అనుదీప్, సింధు తపస్వి, బత్తుల వీరయ్య, అన్వర్ పాషా, పూసల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

**సీఐటీయూ నుంచి టీబీజీకేఎస్‌లోకి..**

బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సింగరేణి కార్మికులు పలువురు సీఐటీయూ నుంచి టీబీజీకేఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు వీరికి గులాబీ కండువాలు కప్పారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పూర్తిగా నమ్మకం కోల్పోయారు.. హామీలు ఇవ్వడం అమలు చేయకపోవడం అలవాటుగా మారిన కాంగ్రెస్ సర్కార్‌ను యువత అసలే నమ్మడం లేదు. ఎన్నికల సమయంలో హస్తం పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కసారి పరిశీలిస్తే.. అధికారంలోకి రాగానే రైతులందరికీ రుణమాఫీ అన్నారు.. అతికొద్దిమందికే చేశారు. రైతుబంధు మూడు, నాలుగు ఎకరాలకే పరిమితం చేశారు. ఆత్మీయ భరోసా అంటూ ఉపాధిహామీలకు మొండి 'చేయి' చూపారు. ఇందిరమ్మ ఇండ్లు అన్నారు.. ఇంతవరకు ఎక్కడా ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపానపోలేదు.. మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, పింఛన్ల పెంపు, కొత్త పింఛన్లు, జాబ్ క్యాలెండర్ అసలు వీటి ఊసే ఎత్తడం లేదు. ఇప్పుడొచ్చి 'రాజీవ్ యువ వికాసం' పేరుతో హడావుడి చేస్తుండడంతో యువత ఒక్కరు కూడా నమ్మడం లేదు. పథకానికి దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులను ఎవరినీ పలుకరించినా రుణం వస్తుందని 'మాకు నమ్మకం లేదు సారూ..' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.**

– రఘునాథపాలెం, ఏప్రిల్ 10



ధ్రువపత్రాల కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ఆశావహులు

# నిజంగా ఇచ్చేవేనా?

- 'రాజీవ్ యువ వికాసం' రుణాలపై ఆశావహుల అనుమానం
- కాంగ్రెస్ సర్కార్‌పై నమ్మకమే లేదంటున్న యువతీ యువకులు
- మీ సేవా కేంద్రాలు, తహసీల్ కార్యాలయాల వద్ద జనం రద్దీ
- పనులు మానుకొని మరీ దరఖాస్తు చేసేందుకు పరుగులు
- ఖమ్మం జిల్లాలో లక్షల సంఖ్యలో వస్తున్న దరఖాస్తులు



దరఖాస్తుదారులతో రద్దీగా ఉన్న ఖమ్మం మున్సిపల్ కార్యాలయ మీసేవా కేంద్రం

కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు కూసింత నమ్మకం కూడా లేకుండాపోయింది. రాష్ట్రంలో పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను పక్కనపెట్టి.. కాంగ్రెస్ ఇస్తామన్న పథకాలను ఇయ్యక ఊరూరా.. వాడవాడా..! జనాగ్రహాన్ని మూటగట్టుకున్నది. మేనిఫెస్టోలోని హామీలకే దిక్కులేదు.. ఇక అందులో లేనివి అమలు చేసేనా..? అనే ప్రశ్నలు కొత్తగా తెరపైకి వచ్చిన 'రాజీవ్ యువ వికాసం' పథకంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి రుణాలను ఇస్తామంటూ 'రాజీవ్ యువ వికాసం' పేరుతో ఉపాధి కోసం బ్యాంక్ రుణాలు ఇస్తామంటూ పథకం అమలుకు ముందే అరచేతిలో స్వర్గాన్ని చూపెడుతున్నది. యూనిట్ కాస్ట్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చునని ఆశలను కల్పిస్తోంది. ఈ పథకం కింద రుణం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలంటూ తెగ హడావుడి చేస్తోంది. అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు అందరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. శాఖలవారీగా జిల్లాస్థాయిలోని అన్ని కార్పొరేషన్ అధికారుల నుంచి ఐఏఎస్‌ల వరకు 'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటూ పెద్దఎత్తున విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పథకంపై సోషల్ మీడియాలోనూ పెద్దఎత్తున వైరల్ అవుతోంది. అధికారులు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెబుతుండడంతో ఆశావహులు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో దరఖాస్తులు చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రచారం చేసుకుంటున్నంత గొప్పగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని అమలు చేసేనా అనే అనుమానాలను మాత్రం ఖమ్మం జిల్లాలో ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు 'రాజీవ్ యువ వికాసం' పేరుతో అమాయకులైన నిరుద్యోగ యువతీ యువకులను మోసం చేసేందుకే కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చిందని అంటున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో సుమారు 10 లక్షల దరఖాస్తులు ఆయా మండలాల్లోని తహసీల్దార్, మున్సిపల్, పురపాలక కార్యాలయాలకు అందినట్లు సమాచారం. మరో వారం రోజులు దరఖాస్తుకు గడువు ఉండగా మరో రెండు లక్షల వరకు వస్తాయనేది అధికారులు అంచనా వేస్తున్నారు.

### మీ సేవా కేంద్రాలు, తహసీల్ ఆఫీసుల్లో రద్దీ..

కాంగ్రెస్ ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పథకం కింద రుణం పొందాలంటే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేసింది. అందుకు అవసరమైన పత్రాలు పొందేందుకు ఖమ్మం జిల్లాలోని మీ సేవా కేంద్రాలు, మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద జనంతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రుణం పొందాలనే ఆశతో పనులు మానుకొని రోజుల తరబడి అవసరమైన పత్రాల కోసం తహసీల్ ఆఫీసుల చుట్టూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పథకానికి దరఖాస్తు చేసుకోవడం వ్యయప్రయాసలతో కూడుకున్నదైనప్పటికీ రుణం వస్తే ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చనే ఆశతో దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ప్రజల అవసరాలను 'క్యాష్' చేసుకునేందుకు తహసీల్ ఆఫీస్ వద్ద తిష్టవేసిన కొందరు దళారులు ధ్రువీకరణ పత్రాల మంజూరు పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది సహకారంతో బయట కొంతమంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మీ సేవా కేంద్రాలకు వచ్చే జనం తాకిడిని దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు సైతం అందినకాడికి క్యాష్ చేసుకుంటున్నారు. దరఖాస్తుకు రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు పలువురు వాపోతున్నారు.



**మోసం చేసేందుకే ఈ పథకం..**

సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ఇకముందు కూడా చేస్తుంది. ఇప్పుడు కొత్తగా యువతీ యువకులను మోసం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం చేస్తోంది. అప్లై చేసుకుంటే స్వయం ఉపాధి పొందేందుకు వ్యాపార రుణాలు అందిస్తామని చెబుతున్నది. ఖమ్మం జిల్లాలోనే లక్షలకొద్దీ దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేదు. ఈ పథకాన్ని అమలుచేయాలంటే రూ.6 వేల కోట్లు కావాలంట.

–బచ్చలకూర భరత్, దరఖాస్తుదారుడు, గుట్టలబజార్, ఖమ్మం

**కొర్రీలు పెట్టకుండా రుణం ఇవ్వాలి**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రాజీవ్ యువ వికాసం పథకం కింద బ్యాంకు రుణం ఇవ్వాలి. రెండ్రోజులపాటు పనులు మానుకొని పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. రుణం వస్తుందో లేదో అనుమానంగా ఉంది. ఖమ్మం జిల్లాలోనే 9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. వారందరికీ రుణం ఇవ్వాలంటే కష్టమే. ఎలాంటి షరతులు పెట్టకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి.

–బానోతు శివలాల్, దరఖాస్తుదారుడు, రఘునాథపాలెం

**బ్యాంక్‌తో లింకు లేకుండా ఇవ్వాలి..**



రాజీవ్ యువ వికాసం పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే రుణం ఎలాంటి బ్యాంక్ గ్యారెంటీలు లేకుండా అందించాలి. మాలాంటి పేదలం బ్యాంకులకు ప్రాపర్టీ చూపించలేం. ప్రభుత్వమే నమ్మకంతో రుణాలు ఇవ్వాలి. సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రజలను మోసగించినట్లు యువకులను మోసం చేస్తే ఊరుకోం. అలా చేస్తే కాంగ్రెస్‌ను జన్మలో నమ్మరు.

–మైసా స్టాలిన్, దివ్యాంగుల కాలనీ, ఖమ్మం

## ఊరూరు నుంచి తరలిరావాలి

**చింతకాని సన్నాహక సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు**



చింతకానిలో రజతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లింగాల కమల్‌రాజు

మధిర (చింతకాని), ఏప్రిల్ 10: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరు నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ అభిమానులు తరలిరావాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చారు. చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం లచ్చగూడెం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, వారి విధానాలను ఎండగట్టేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని కోరారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేయకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, జిల్లా నాయకులు మంకెన రమేశ్, కార్యదర్శి గడ్డం వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాసరావు, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పంట భూములను లాక్కోవద్దు సారూ..

- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలెపల్లి రైతుల నిరసన
- జేసీబీలు, బుల్డోజర్లను అడ్డుకొని ధర్నాకు దిగిన రైతులు



చేతులు జోడించి పోలీసులను వేడుకుంటున్న మహిళా రైతులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 10: యాభై ఏళ్లకు పైబడి సాగు చేసుకుంటున్న తమ పంట భూములను ప్రభుత్వం లాక్కోవద్దని కోరుతూ టెంట్లు వేసి రైతులు నిరసనకు దిగారు. పోలీసుల సహకారంతో జేసీబీలు, బుల్డోజర్లతో అధికారులు అక్కడికి చేరుకోవడం.. తమ భూముల జోలికి రావొద్దని రైతులు ప్రాధేయపడడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రైతులు జేసీబీలను అడ్డుకొని ధర్నాకు దిగారు. ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలం పోలెపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలెపల్లి సమీపంలోని మున్నేరు వాగు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన భూముల్లో ఉదయం 10 గంటల నుంచి టెంట్లు వేసి వంద మంది రైతులు నిరసన చేపట్టారు. తాము సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవద్దని అధికారులను కోరారు. ఈ క్రమంలో అధికారులు జేసీబీలు, బుల్డోజర్లతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రైతులు జేసీబీలు, బుల్డోజర్లను అడ్డుకున్నారు. అప్పటికే ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బందికి రైతులు రెండు చేతులు జోడించి దండం పెట్టారు. తమ భూముల జోలికి రావొద్దని వేడుకున్నారు. పెళ్లిళ్ల సమయంలోనే తమ కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద రాసిచ్చామని ప్రాధేయపడ్డారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. చివరికి 'రెండు రోజుల సమయం ఇస్తున్నాం. ఈలోగా నిర్ణయం తీసుకోవాలి' అని రైతులకు పోలీసు అధికారులు సూచించారు. తర్వాత అక్కడి నుంచి బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లిపోవడంతో రైతులు శాంతించారు. సీపీఎం మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులకు మద్దతు తెలిపారు.



ఖమ్మం కేయూ పీజీ, వ్యాయామ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు

# మాకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తారా?

**ఖమ్మంలో కాంట్రాక్ట్, పార్ట్‌టైం లెక్చరర్ల ధర్నా**

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 10: కాకతీయ యూనివర్సిటీలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేకుండా చేసేందుకే ప్రభుత్వం జీవో 21ని తెచ్చిందని యూనివర్సిటీ కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు ఆరోపించారు. జీవో 21కి వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ఆందోళనలో కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం అరెస్టు చేయించినందుకు నిరసనగా ఖమ్మంలోని యూనివవర్సిటీ పీజీ, వ్యాయామ కళాశాలల అధ్యాపకులు గురువారం తరగతులు బహిష్కరించారు. అనంతరం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలూ కలిగి 30 ఏళ్లుగా యూనివర్సిటీలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించకుండా నేరుగా నియామకాలు చేపట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్, గోపి, శ్యాంబాబు, కోటి, శేఖర్, మధు, రవిబాబు, వీరన్న, రాజీవ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తరుగు తీస్తే కఠిన చర్యలు

- కేంద్రాల్లో సమస్యలుంటే అధికారులకు చెప్పండి
- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు చేయాల్సిందే..
- బోదులబండ రైతులతో ముఖాముఖిలో కలెక్టర్

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 10: రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యంలో తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మిల్లర్లను హెచ్చరించారు. గురువారం నేలకొండపల్లి మండలం బోదులబండకు చేరుకున్న కలెక్టర్ నేరుగా పొలాల్లోకి వెళ్లి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వరి కోతలైన తర్వాత ధాన్యం ఎక్కడికి తరలిస్తున్నారు? వర్షాలకు ఏమైనా తడిశాయా? దళారులకు అమ్మకాలు చేస్తున్నారా? తక్కువ ధరకు కొనుగోలు చేయడంతోపాటు ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా? మిల్లర్లు తరుగు తీస్తున్నారా? తేమ శాతం వచ్చిన తర్వాత ఆలస్యం చేస్తున్నారా? అనే విషయాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. తరుగు తీసే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోవద్దని, అలాంటివి ఏమైనా ఉంటే స్థానిక అధికారులకు తెలియజేయాలని సూచించారు. కాంటాలు, హమాలీలు, గన్నీ బ్యాగులు, లారీలు ట్రాన్స్‌పోర్టు తదితరాలను సక్రమంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కూడా తాలు, తేమ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఈ ఏడాది ఎంత పంట పండింది? ఇంకా ఎంత కోతలకు రావాల్సి ఉంది? అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు విక్రయానికి తెచ్చిన ధాన్యం 48 గంటల్లో కొనుగోలు చేయాలని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నారని, దీనిని వినియోగించుకోవాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏడీఏ సరిత, ఏవో రాధ, తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీవో ఏర్రయ్య, రైతులు శ్రీనివాసరావు, బాజా నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.



బోదులబండలో నేలపై కూర్చొని రైతులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ఖాన్

# ఏసీబీకి చిక్కిన భద్రాచలం సీఐ

- అతడి గన్‌మెన్ సహా మరో వ్యక్తి కూడా..
- గ్రావెల్ లారీని విడిచిపెట్టేందుకు లంచం డిమాండ్
- ఏసీబీ అధికారులతో వాగ్వాదానికి దిగిన ఇన్‌స్పెక్టర్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమేశ్

భద్రాచలం, ఏప్రిల్ 10: గ్రావెల్ తరలిస్తున్న లారీని విడిచిపెట్టేందుకు లంచం డిమాండ్ చేసిన సీఐ, గన్‌మెన్, ఓ ప్రైవేటు వ్యక్తిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాచలం పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 19న బూర్గంపాడు లక్ష్మీపురానికి చెందిన ఓ లారీలో గ్రావెల్ తరలిస్తుండగా భద్రాచలంలో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో కేసు లేకుండా లారీని విడిచిపెట్టేందుకు యజమాని నుంచి సీఐ గన్‌మెన్ రామారావు రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో సదరు యజమాని తన వద్ద డబ్బులు లేవు అని చెప్పినా.. రూ.20 వేలు ఇచ్చినా సీఐతో చెప్పి లారీని వదిలిపెడతామని పేర్కొన్నారు. చేసేది లేక లారీ యజమాని రూ.20 వేలు సమకూర్చుకుని గన్‌మెన్ రామారావుకు చెప్పాడు. ఆ డబ్బులు నాకు ఇవ్వొద్దు అని చెప్పి.. సారపాకకు చెందిన కార్తీక్ అనే వ్యక్తికి పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఫోన్ పే చేయించారు. అనంతరం పోలీసులు లారీని విడిచిపెట్టారు. తర్వాత లారీ యజమాని ఏసీబీ అధికారులకు జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో గురువారం భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఏసీబీ అధికారులు తొలుత సారపాకలో కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గన్‌మెన్ రామారావును, సీఐ బరపటి రమేశ్‌ను అదుపులోకి తీసుకొని ముగ్గురిని కలిపి విచారించారు. సీఐ సూచన మేరకే తాను లారీపై కేసు లేకుండా చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు రామారావు అంగీకరించాడు. అలాగే ఫోన్ పే చేసిన వీడియో సైతం రికార్డు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ వివరించారు. ముగ్గురిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

**ఏసీబీ అధికారులతో సీఐ వాగ్వాదం**

గన్‌మెన్ చేసిన తప్పుకు కేసులో తనను ఇరికించి అన్యాయం చేశారని భద్రాచలం సీఐ రమేశ్ విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గన్‌మెన్ రామారావు తీసుకున్న డబ్బుల విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, తననెందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదని ఏసీబీ డీఎస్పీతో భద్రాద్రాచలం సీఐ వాగ్వాదానికి దిగారు.

**రెండోసారి ఠాణాపై ఏసీబీ దాడి**

ఏడాది వ్యవధిలోనే రెండుసార్లు భద్రాచలం పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ అధికారులు దాడులు చేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది ఏప్రిల్ 18న ఇదే పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై ములగొండ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్‌శెట్టి శంకర్‌తోపాటు మరో సీసీ కెమెరా టెక్నీషియన్ ఓ దొంగతనం కేసులో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.



ఏసీబీకి పట్టుబడిన సీఐ బరపటి రమేశ్, గన్‌మెన్ రామారావు, మరో వ్యక్తి